## క్లుప్తంగా

### రైతు ఉసురు తీసిన తుఫాన్



నాదెండ్ల: కష్టపడి పండించిన పంట కళ్ళ ముందే నీట మునగటంతో ఓ కౌలు రైతు గుండె ఆగింది. మండలంలోని గణపవరం అంబేద్కర్ కాలనీలో బుధవారం కౌలు రైతు మరణించిన విషాద సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాటిబండ్ల ఆదం (55) రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. పంట సాగు కోసం రూ.1.50 లక్షలు అప్పులు చేసి సాగు చేశాడు. అయితే మిచాంగ్ తుఫాను కారణంగా ఎడతెరిపి లేని వర్షాలతో పొలాలు నీట మునిగాయి. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పొలానికి వెళ్లి నీట మునిగిన పంటలను చూశాడు. తీవ్ర మనస్తాపంతో తిరిగి ఇంటికి వచ్చి మదనపడ్డాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో భార్య రాణి ఆదంను లేపే ప్రయత్నం చేయగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి బోరుమంది. వలంటీర్ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారమిచ్చాడు. ఆర్ఐ రమీజా వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి అంగవైకల్యం ఉండటంతో ప్రతినెలా వైఎస్సార్ పింఛను అందుకుంటాడు. మృతుడికి ఇరువురు కుమార్తెలు కాగా, వారికి వివాహాలయ్యాయి.

### లక్ష రూపాయల గొర్రెలు చోరీ

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురం గ్రామంలో గొర్రెలు అపహరణకు గురైన సంఘటన చోటు చేసుకుంది. బుధవారం స్థానిక పోలీసు స్టేషనులో ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన ముద్దా హనుమంతరావుకు చెందిన 30 గొర్రెలు ఉండగా మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 18 గొర్రెలను చోరీ అయినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు. చోరీకి గురైన గొర్రెలు రూ. లక్ష రూపాయలు ఖరీదు చేస్తాయని బాధితుడు వాపోయాడు.

### కారు తిరగబడి ఐదుగురికి గాయాలు

రొంపిచర్ల: మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా కొట్టి ఐదుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్లుతున్న కారు మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో తంగేడుమల్లి మేజర్ కాల్వ సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళ్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేయబోయి అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

### రేపు విప్పర్లపల్లిలో ఆలయ శిలాన్యాసం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో స్వయంభూగా వెలిసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ నరసింహ స్వామి వారి ఆలయ శిలాన్యాస మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి జీర్ణోద్ధరణ కార్యక్రమం కూడా జరుగుతుందని తెలిపారు. భక్తుల సహకారంతో కళాపరకర్షణ బాల ఆలయ శంకుస్థాపన కార్యక్రమం కూడా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ బ్రహ్మశ్రీ గోలి వెంకట సుబ్రహ్మణ్య శర్మ అవధాని ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

### విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాజేష్



చిలకలూరిపేట: నరసరావుపేట డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని పసుమర్రుకు చెందిన మైలా రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నరసరావుపేట ఆర్డీవో జారీ చేసిన నియామక పత్రం అందుకున్నారు. రెండేళ్ల పాటు ఆయన కమిటీ సభ్యుడిగా కొనసాగుతారు. ఈ సందర్భంగా మైలా రాజేష్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ప్రజల కు అవసరమైన చట్టపరమైన సహాయ సహకారాలను పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల ద్వారా అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవి ఇప్పించిన మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరని మిచాంగ్ కంట‘తడి’



కోటప్పకొండరోడ్డులో ఇంటి యజమానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాచవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఓగేరు వాగు



పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలోకి చేరిన వర్షపు నీరు



నరసరావుపేటలో విద్యుత్ తీగెలపై పడిన చెట్ల కొమ్మలను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న సిబ్బంది



మిర్చి పొలంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపేందుకు గండి కొడుతున్న రైతులు

- తుఫాన్ నుంచి తేరుకుంటున్న జనం
- ముమ్మరంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు
- పంటపొలాల్లో నీటి తొలగింపుపై సూచనలు
- ప్రాథమిక అంచనాల తయారీలో వ్యవసాయ సిబ్బంది
- పునరావాస కేంద్రాలలో భోజన వసతులు

నాదెండ్ల: మిచాంగ్ తుఫాను రైతులను కంటతడి పెట్టించింది. పలుచోట్ల పత్తి పైరు తడిచి పంటను నేలపాలు చేసింది. ఏపుగా పెరుగుతున్న మిర్చి తోటలు తుఫాను దెబ్బకు ఒరిగిపోయాయి. శనగ కొన్నిచోట్ల మొలకెత్తాల్సి ఉండగా, దెబ్బతిని మొలక పోయింది. కంది పైరు పూతరాలి దిగుబడి తగ్గేందుకు కారణమైంది. మంగళవారం నాటికి పంట పొలాల్లో నీరు నిల్వ ఉంది. తుపాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, ఏఈవోల సాయంతో పంట ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు.

**మూడు చోట్ల పునరావాస కేంద్రాలు...**

గణపవరం - చిలకలూరిపేట వెళ్లే రోడ్డులో కుప్పగంజివాగు పొంగి ఇళ్లలోకి అర్ధరాత్రి నీరు చేరింది. రెవెన్యూ అధికారులు స్పందించి స్థానికులను బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చేర్చారు. వీరికి అవసరమైన భోజన ఏర్పాట్లు చేశారు. మరికొంత మందిని అక్కడే ఉన్న మండలనేని లక్ష్మయ్య కళ్యాణ మండపంలోకి చేర్చారు. అమీన్ సాహెబ్‌పాలెం గ్రామంలో పారిశుధ్య కార్మికుల ఇళ్లలోకి నీరు చేరటంతో అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గణపవరంలో 150 మంది, అమీన్‌సాహెబ్‌పాలెంలో 20 మందికి ఆశ్రయం కల్పించారు. గణపవరం కుప్పగంజివాగు వద్ద, గొరిజవోలు లోలెవల్ చప్టా వద్ద, తూబాడు చప్టా వద్ద రహదార్లపై భారీ ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో పోలీసులను కాపలాగా ఉంచారు.

**విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ...**

మిచాంగ్ తుఫాన్ ప్రభావానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం నుంచి పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు ఏఈ ప్రసాద్ చెప్పారు. సంకురాత్రిపాడు పొలాల్లో రెండు చోట్ల, జంగాలపల్లెలో మూడుచోట్ల, కావూరు వెళ్లే డొంక రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మరో స్తంభం విరిగి పడటంతో నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మరికొన్నిచోట్ల పొలాల్లో విరిగిన స్తంభాలను మరమ్మతులు చేసేందుకు వెళ్లే మార్గం లేక పనులు నిలిచాయి.

**ఆదుకుంటాం.. ధైర్యంగా ఉండండి: ఎమ్మెల్యే గోపిరెడ్డి హామీ**

నరసరావుపేట: మిచాంగ్ తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సత్తెనపల్లి, గుంటూరురోడ్డులోని సీబీ కాలనీ, టిడ్కో కాలనీ, బీసీకాలనీలలో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీసు శాఖలకు చెందిన అధికారులతో పర్యటించారు. సత్తెనపల్లి రోడ్డులోని చప్టా మీదుగా చేరిన వర్షపు నీరు పోయే చర్యలను మున్సిపల్ అధికారులు వెంటనే చేపట్టారు. చప్టా గోనెలకు నీరుపోకుండా అడ్డుపడిన చెత్తాచెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించటంలో నీరు చప్టాపైకి రాకుండా సమస్య పరిష్కారం చేశారు. అలాగే ప్రకాష్‌నగర్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలోకి చేరిన వర్షపు నీటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

సెయింటాన్స్ కళాశాల గోడ వద్ద విద్యుత్ తీగెలపై పడిన చెట్ల కొమ్మలను క్రేన్ సహాయంతో తొలగించి సరఫరాను పునరుద్ధరించా రు. సీబీ కాలనీలోని ప్రజలను తుఫాన్‌కు ఎలా ఉన్నారంటూ ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రశ్నించగా ఇటీవల కాలువల్లో పూడిక తీయటం వలన తమ ఇళ్ల మీదకు వర్షపు నీరు రాలేదని, దీని వలన తామందరికీ ఇబ్బంది లేకుండా ఉన్నామని సమాధానమిచ్చారు. కోటప్పకొండరోడ్డులోని పేరంటాలమ్మ దేవాలయం వద్ద రోడ్డుపక్కనే ఉన్న ఒక గుడిసెపై చెట్టుకొమ్మలు విరిగిపడి దెబ్బతిన్నది. పట్టణంలోని ఎనిమిదవ వార్డు ఇస్లాంపేటలో ఓ మైనార్టీకి చెందిన ఇంటిగోడ కూలిపోవటంతో ఆ ప్రదేశాన్ని పరిశీలించి నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కేసానుపల్లి రోడ్డులోని టిడ్కో గృహాల ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రాంతాలను అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించామన్నారు. వర్షాల కారణంగా కంట్రోలు రూంలను ఏర్పాటు చేయించామన్నారు. గుంటూరు రోడ్డులోని స్వర్గపురికి ఎదురుగా రోడ్డుపైకి చేరిన నీటి వలన ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పోలీసులచే రాత్రంతా పెట్రోలింగ్ ఏర్పాటు చేయించామన్నారు. వాహనాలను వేరే రూట్‌లో పంపించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూశామన్నారు. విద్యుత్ తీగెలపై చెట్లు విరిగి పడటం వలన విద్యుత్ స్తంభాలు పడిపోయి సరఫరాకు ఆటంకం ఏర్పడిందన్నారు. అయితే సిబ్బంది వెంటనే కలుగచేసుకొని 80 శాతం పునరుద్ధరించారని, మిగతా 20 శాతం కూడా చెట్లకొమ్మలను తొలగించి సరఫరా పునరుద్ధరిస్తారన్నారు. సీబీ కాలనీలో ప్రజలను పలుకరించగా తామందరమూ ఆహారానికి ఇబ్బంది పడుతున్నామంటే పులిహార పంపిణీకి ఏర్పాటు చేయించామన్నారు. ఎక్కడైనా ఇబ్బంది పడుతుంటే కాల్‌సెంటర్లకు ఫోన్‌చేసి తెలియచేయాలని ప్రజలను కోరారు.

**ఒకటో వార్డులో పులిహార పంపిణీ**

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆదేశాల మేరకు ఒకటో వార్డు ఇన్‌చార్జి రామిశెట్టి కొండ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుమారు 500మంది సీబీ కాలనీ వాసులకు పులిహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ డీఇ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏడీఇ వై.ఏడుకొండలు, ఏఈ సురేంద్ర, గిరిజన కార్పొరేషన్ డైరక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు కాకుమాను సదాశివరెడ్డి, షేక్ కరిముల్లా, ఎన్‌కే అంజనేయులు, కాకుమాను కోటిరెడ్డి, షేక్ గౌస్, మల్లికార్జునరావు, రామిరెడ్డి, దాసరి శ్రీను పాల్గొన్నారు.

**తగ్గని వాగుల ఉధృతి**

రొంపిచర్ల : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో మండలంలో గ్రామాలన్నీ అంధకారమయ్యాయి. ఈదురుగాలులతో వర్షం కురవడం వలన మండలంలో పలు గ్రామాలలో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఈ వర్షాలకు పంట పొలాలు నీటమునిగాయి. రైతులు సాగుచేస్తున్న మిర్చి, కంది, మంచిశనగ, మొక్కజొన్న, మినుము, వరి వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధిక వర్షానికి పంటలన్నీ నీళ్ళల్లో నానుతుండగా వరి పొలాలు గాలికి నేలవాలాయి. వాగులు పొంగటం, చెట్లు పడిపోవడం వల్ల రాకపోకలు నిలిచాయి. పొలాల్లో కోసిన వరిఓదెలు తడిచిపోగా ఇప్పటికే ఆర్వేస్టర్ చేయించిన వరి ధాన్యాన్ని కాపాడుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపల్లి, పరగటిచెర్ల, మాచవరం, విప్పర్ల, రెడ్డిపాలెం, బిహారావారిపాలెం, చాకలికుంటతండా తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేశారు.

మండలంలో అన్ని గ్రామాలలో వాగులు, చెరువులు, కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో విప్పర్లపల్లి గ్రామ సమీపంలో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహించటం ఆ రోడ్డులోని చెట్లు పడిపోవడం వల్ల ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయాయి. ఆ వాగు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాచవరం, అన్నవరం, మునమాక, విప్పర్లపల్లి తదితర గ్రామాల సమీపంలోని వాగులు పొంగటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



గణపవరం-చిలకలూరిపేట రోడ్డులో కుప్పగంజి వాగు పొల్లి లక్ష్మీ గణపతి ఆలయాన్ని తాకిన వరదనీరు

### రైతులకు తీరని నష్టం

నరసరావుపేట రూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు మండలంలోని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండురోజుల్లో మండలంలో 20 సెం.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయానికి 65.5 మి.మిలు వర్షం కురిసింది. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షం నమోదైంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయానికి 154.2 మి.మిల వర్షం కురిసింది. ఎడతేరిపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది. పంటపొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. వాగులు పొంగి ప్రవహించాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలో ప్రధాన పంటలైన మిరప, పత్తితో పాటు శనగ, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో అధిక మంది రైతులు శనగ పంట సాగును ఈఏడాది చేపట్టారు. గత నెలలో కురిసిన వర్షాలకు భూమి పదును కావడంతో శనగ విత్తనాలు విత్తారు. మొలక దశ దాటిన శనగ పంట పొలాల్లో నీరు నిలవడంతో ఆ పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. అధిక వర్షంతో కాపు దశలో ఉన్న మిరప పంట పక్కకు వాలిపోయాయి. వర్షాభావంతో ఇప్పటి వరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మిరప పంటను సాగుచేసిన రైతులు నేలకొరిగిన పంటను చూసి ఆవేదన చెందుతున్నారు. రెండురోజులు ఎండ వస్తే కాని పంట ఎంత వరకు చేతికోచ్చింది చెప్పలేమని రైతులు చేబుతున్నారు. పత్తి పొలాల్లోకి నీరు రావడంతో పాటు పలు చోట్ల మొక్కలు వాలిపోయాయి. కొండకావూరులో అరటి పంట నేలకొరిగింది. భారీ వర్షానికి కోటప్పకొండ ఘాట్‌రోడ్డులో కొండపై నుంచి రాళ్లు జారిపడ్డాయి. అటవీ సిబ్బంది, ఆలయ సిబ్బంది రాళ్లను తొలగించారు. గొనెపూడి సమీపంలోని ఏడు మంగళం వాగు ఉధృతితో ప్రవహించింది. చప్టాపై మూడు అడుగుల ఎత్తుతో నీరు ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

### బాధితులకు ఆహారం పంపిణీ



బోయపాలెంలో బాధితులకు అల్పాహారం అందజేస్తున్న దాతలు

యడ్లపాడు: గ్రామాల్లో తిరిగి చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే కొందరు తుఫాను కారణంగా ఇబ్బందులు పడటాన్ని గమనించిన ఏఎంఆర్, రుద్ర సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది స్పందించారు. మంగళ, బుధవారం ఆయా సంస్థల యాజమాన్యం సహకారంతో 20 మందికి అల్పాహారం, భోజనం సదపాయం కల్పించారు. ఇందుకు ఎఎంఆర్ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాదరెడ్డి, సూపర్‌వైజర్ నాగార్జున రెడ్డి, లక్ష్మణ్, రుద్ర సంస్థ ఎండీ వైవీఆర్, పీడీ ఎం మస్తాన్, ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, బి సురేష్ నాయుడు, వి హెచ్‌ఆర్ నాయక్ ఉన్నారు.



నీట మునిగిన పెసర పైరు



వర్షానికి, ఈదురు గాలులకు నేలవాలిన కంది పైరు



ఈదురు గాలులకు నేలవాలిన మొక్కజొన్న పైరు

### రెవెన్యూ అధికారులు ఆదుకున్నారు



మాది గణపవరంలోని వడ్డెరకాలనీ. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. వెంటనే రెవిన్యూ అధికారులు స్పందించి తమను సురక్షిత ప్రాంతానికి తరలించారు. నాతో పాటూ మరో 30 కుటుంబాల సభ్యులు సుమారు వంద మందిని తరలించారు. మంగళవారం రాత్రి భోజనం, బుధవారం ఉదయం టిఫిన్ ఏర్పాటు చేశారు. ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాల వివరాలు నమోదు చేసుకున్నారు. వలంటీర్లు ఎంతో సాయం చేశారు.

– చల్లా సత్యవతి, గణపవరం.

### యంత్రాంగం స్పందించింది



మాది గణపవరంలోని యానాది కాలనీ. పారిశుద్ధ్య పనులు చేసుకుని జీవిస్తున్నాం. తుఫాను కారణంగా భారీ వర్షం కురిసి మంగళవారం రాత్రి 8 గంటలకు ఇళ్లలోకి నీరు చేరాయి. పెంకుటిల్లు కావడంతో కప్పు దెబ్బతిన్నది. ఇంట్లోని సామాన్లు తడిచిపోయాయి. అధికారులు విషయం తెలుసుకుని మమ్మల్ని సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు. రాత్రి భోజనం, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఇళ్లు దెబ్బతిన్న వారి వివరాలను వీఆర్వో నమోదు చేసుకున్నారు.

–బొజ్జా సీత, గణపవరం.



చిలకలూరిపేట-గణపవరం మార్గమధ్యంలో రోడ్డును ముంచెత్తిన వరద నీరు



గణపవరం యానాదుల కాలనీలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



సంకురాత్రిపాడులో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



నాదెండ్లలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది



గణపవరం పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనాన్ని సరఫరా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

# పంటలు పరిశీలించి.. సూచనలు చేసి..

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వ్యవసాయ అధికారులు శనగ పంటను వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ బోయపాటి రవిబాబు మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ధాటికి వేల్పూరు గ్రామంలో 2 వేల ఎకరాలు శనగ పంట రైతులు సాగు చేశారని ప్రస్తుతం శనగ పంట తేమ శాతం అధికంగా ఉండటం వలన ఊరకెత్తుతాయన్నారు.

**నాదెండ్లలో...**

నాదెండ్ల: తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం అధికారులు పరిశీలించారు. పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్‌లు సాతులూరు, కనపర్రు, రాజుగారిపాలెం, చిరుమామిళ్ళ, నాదెండ్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

**నీటి నిల్వలు తొలగించండి**

వినుకొండ(నూజెండ్ల): మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలోని దెబ్బతిన్న పంట పొలాల రైతులకు ఏడీఏ రవిబాబు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో తడవకుండా ఆరబెట్టుకోవాలన్నారు.

**రూరల్ పరిధిలో...**

నరసరావుపేట రూరల్: తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. పమిడిమర్రు, కొండకావూరు, యల్లమంద గ్రామాల్లో జిల్లా ఉద్యాన అధికారి బి.జాన్ బెన్ని, ఉద్యాన అధికారి దాసరి నవీన్ కుమార్‌లు పర్యటించారు. జొన్నలగడ్డలో నీటమునిగిన శనగ పంటను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏడీఏలు మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి నరేంద్రబాబు పరిశీలించారు.



వేల్పూరులో శనగ పంట పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

**బొల్లాపల్లి మండలంలో...**

బొల్లాపల్లి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావం మండలంలో ఏమేరకు పంటలు దెబ్బతిన్నాయని సంఘటనపై ఏడీఏ బి.రవిబాబు, వ్యవసాయాధికారి ఎ.అంకారావు బుధవారం పరిశీలించారు. బొల్లాపల్లి మండలంలో వెల్లటూరు, వడ్డెంగుంట, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, పేరూరుపాడు తదితర గ్రామాల్లో అధికారులు శనగ, వరి పంటలను పరిశీలించారు. మండలంలో 600 ఎకరాల మేర శనగ పంట సాగు చేశారని, తుఫాన్ ప్రభావంతో వర్షంలో కొంతమేర నీటమునిగిందని తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పంట 250 ఎకరాల్లో వెల్లటూరు, పేరూరుపాడు, పలుకూరు తదితర గ్రామాల్లో సాగు చేశారన్నారు. వరి ఈదురు గాలలకు నేలకొరిగిందని, గింజ మొలకెత్తకుండా ఎకరానికి 200 లీటర్ల నీటిలో ఒక కేజీ ఉప్పును కలిపి ఆ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.

**మిరప పంటను పరిశీలించిన హెచ్‌వో...**

తుఫాన్ ప్రభావంతో మిరప పంటను ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ పరిశీలించారు. ఈదురు గాలులకు మిరప మొక్కలు నేలకొరిగాయని, నీరు నిల్వ ఉండకుండా బయటకు వెల్లబెట్టాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు.

**ఈపూరు మండలంలో...**

ఈపూరు: మిచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలోని వనికుంట, కొండాయపాలెం గ్రామాల్లో శనగ పూర్తిగా మునిగిపోయింది. అలాగే ఊడిజర్ల, అగ్నిగుండాల, వనికుంట, శ్రీనగర్‌లతో పాటు ఆయా గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. మిర్చి పంట పూర్తి స్థాయిలో ఉరకెక్కింది. తహసీల్దార్ సుధాకర్, ఏవో రామారావులు ఆయా గ్రామాల్లోని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

**ఉరకెత్తకుండా అప్రమత్తంకండి**

యడ్లపాడు: రైతులు తమ పంటచేలలో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఏడీఏ ఎం మస్తానమ్మ చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారితో కలిసి మండలంలోని జలాది, యడ్లపాడు, లింగారావుపాలెం తదితర ముంపు ప్రాంతాల గ్రామాల్లోని పొలాలను సందర్శించారు.

# డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘననివాళి

వినుకొండ(నూజెండ్ల): భారతరాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బేతం గాబ్రియేలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, లక్ష్యాలను ప్రజలకు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు పాల్గొన్నారు.

- ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా న్యాయవాదులు ఘనంగా నివాళులు అర్పించారు.
- పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో ఉన్న అంబేద్కర్‌కు కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.
- సూర్యచంద్రులు ఉన్నంతకాలం అంబేడ్కర్ మనతోనే ఉంటారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ అన్నారు.

నాదెండ్ల: ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని మన దేశానికి అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రిటైర్డ్ జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ బహుజంకు రాజేశ్వరరావు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని గణపవరం మెయిన్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యార్డు మాజీ డైరెక్టర్ దారా కొండయ్య, కిలారు హనుమయ్య, పూలా కోటేశ్వర రావు, అంబేడ్కర్ యూత్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట: దార్శనికుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియడారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కుమార స్వామి పాల్గొన్నారు.



వినుకొండలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నరసరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

బొల్లాపల్లి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని మండలంలో బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, సర్పంచ్ ఎ.సాయిబాబు, తహసీల్దార్ ఎన్. దుర్గేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : మండలంలో అంబేడ్కర్ 67వ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి వేడుకలలో ఎంపీపీ గద్దం వెంకట్రావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.